క్లుప్తంగా

శాకంబరి ప్రసాదం పంపిణీ



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్‌: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులకు శాకంబరి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా 6 టన్నుల కూరగాయాలతో అమ్మవారిని అలంకరించారు. ఆ కూరగాయలు, పండ్లు, గోంగూర, కరివేపాకు భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్‌ గ్రంధి బాబ్జీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నాగలిమల్లితోట జంక్షన్‌ (కాకినాడ సిటీ): సామాజిక స్పృహతో పనిచేసే సేవలు మరువలేనివని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విశ్రాంత అటవిశాఖ అధికారి సీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. విశ్రాంత అటవీ శాఖ ఉద్యోగుల వార్షిక సమావేశం స్థానిక పెన్షనర్స్‌ భవన్‌లో సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన సత్యనారాయణ విశ్రాంత అటవీ శాఖ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వెంకట్రావు, భ్రమరాంబ, సత్తిబాబు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ఏడు గంటలు నిద్రపోవాలి



గౌతమ్‌ ప్రవీణ్‌ను సత్కరిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్‌: ఆరోగ్యకరమైన మెదడు కలిగి ఉండడానికి నిత్యం కనీసం ఏడు గంటల నిద్రపోవాలని ప్రముఖ న్యూరాలజిస్ట్‌ గౌతమ్‌ ప్రవీణ్‌ అన్నారు. ఇండియన్‌ డెంటల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ బ్రెయిన్‌ డే నిర్వహించారు. నిద్రపోవడానికి ముందు నికోటిన్‌, కెఫిన్‌ వంటి తీసుకోరాదన్నారు. అనంతరం గౌతమ్‌ ప్రవీణ్‌ను అసోసియేషన్‌ అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ సభ్యులు అద్దాల సత్యనారాయణ, చైతన్య, సిరాజ్‌, స్వరూప్‌ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారు



పీఎంఏవై పథకం కింద నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తున్న పార్టీ సిటీ కన్వీనర్‌ సత్యనారాయణ

బోట్‌క్లబ్‌: ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా నిరుపేదల సొంతంటి కలను ప్రధాని మోదీ తీరుస్తున్నారని బీజేపీ కాకినాడ సిటీ కన్వీనర్‌ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని చావలివీధిలో సోమవారం ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన పథకం కింద నిర్మించిన ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ పథకంలో నిరుపేదలందరికీ ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇంటిని నిర్మించుకుంటున్న వారికి ఈ పథకంలో రూ.1.80 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. మాజీ కార్పొరేటర్‌ గోడి సత్యవతి, బీజేపీ నాయకులు దువ్వూరి సుబ్రహ్మణ్యం, పానకాల రామకృష్ణ పాల్గొన్నారు.

నవోదయలో శిక్షా సప్తాహ్‌



నవోదయలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణయ్య

పెద్దాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జవహర్‌ నవోదయ విద్యాలయంలో శిక్షా సప్తాహ్‌ నిర్వహించనున్నట్లు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ రామకృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక విద్యాలయలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు ఇచ్చే శిక్షణ అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్‌ బోర్డు ఆఫ్‌ సెకండరీ ఎడ్యుకేషన్‌ భారత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని సీబీఎస్‌ఈ విద్యాసంస్థల్లో 22 నుంచి 28వ తేదీ వరకు విద్యా వారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి రోజు టీచింగ్‌ లెర్నింగ్‌ మెటీరియల్‌ డే, రెండో రోజు రీడింగ్‌, లిజనింగ్‌, స్పీకింగ్‌, రైటింగ్‌ స్కిల్‌పై అవగాహన, మూడో రోజు గేమ్స్‌ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆఖరి రోజు డిజిటల్‌ ఇన్ఫర్మేషన్‌పై అవగాహన సదస్సులో శిక్షా సప్తాహ్‌ ముగుస్తుందన్నారు. విద్యాలయ ఎన్‌సీసీ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ సనపల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌సీసీ ప్రాముఖ్యం, ఉజ్వల భవిష్యత్‌కై ఎన్‌సీసీ పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌.సుధీర్‌కుమార్‌, డి.చక్రవర్తి, ఎస్‌.ఆల్బర్ట్‌ పాల్గొన్నారు.

దాపరికమే పెట్టుబడి!

- నిల్వ వంటకాలతో ప్రజల ఆరోగ్యాలకు హాని
- మరునాటికి అవే పెట్టుబడిగా వ్యాపారం
- నాణ్యతకు తిలోదకాలిస్తున్న హోటళ్లు
- నమోదులకే పరిమితమవుతున్న ఫిర్యాదులు
- చొరవ చూపి తనిఖీలు చేయని ఫుడ్‌ సేఫ్టీ అధికారులు



దాడుల్లో తినడానికి పనికిరాని, నిల్వ ఉంచిన మాంసాన్ని గుర్తించిన అధికారులు (ఫైల్‌)



నగరంలోని ఒక హోటల్‌లో వంటనూనెను పరిశీలిస్తున్న ఫుడ్‌ సేఫ్టీ అధికారులు

బోట్‌క్లబ్‌: రంగుల హంగామాలు, నోరూరించే రీతిలో ఆకట్టుకునే తీరులో ఆహార పదార్థాలు, పొగలు కక్కుతున్నట్లు ప్లేట్‌లో వేడిగా కనిపించే రకరకాల వెజ్‌.. నాన్‌వెజ్‌ వంటకాలు.. ఇవన్నీ మనల్ని ఆకట్టుకోవడానికి హోటళ్ల నిర్వాహకులు చేసే వ్యాపార మాయాజాలం. కానీ కిచెన్‌లోకి వెళ్లి గమనిస్తే ఒళ్లు జలదరించేలా వాస్తవాలు కనిపిస్తాయి. ఆ రోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో నిల్వచేసి తర్వాత అందంగా మేకప్‌ చేసి విక్రయించడాలు, వాడేసిన నూనెనే మళ్లీ వాడేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఎన్ని ఆటలాడతారో అందరికీ తెలిసిందే. కాకినాడలో ఉన్న హోటళ్లపై అధికారులు దాడులు చేయడం అనేది మనకు తెలియదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మాత్రం ఫుడ్‌ సేఫ్టీ అధికారులు హడావుడిగా కేసులు నమోదు చేయడం వరకే పరిమితమవుతున్నారు. అధికారులు తరచూ దాడులు చేస్తే హోటల్‌ యజమానులు నిబంధనలు పాటించి ప్రజలకు శుచికరమైన, శుభ్రమైన ఆహారాన్ని అందించే అవకాశం ఉంది.

దాడులతో వెలుగుచూసిన నిల్వలు

కాకినాడ నగరంలో వందకుపైగా వెజ్‌.. నాన్‌వెజ్‌ హోటళ్లు నడుస్తున్నాయి. ఉదయం టిఫిన్‌, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్‌ వరకూ రకరకాల వంటలను విక్రయిస్తుంటారు. వీటిలో పేరున్న హోటళ్లలోనూ రాత్రి మిగిలిపోయిన ఆహారాన్ని నిల్వ చేసి మరునాడు విక్రయిస్తున్నట్టు అధికారుల దాడుల్లో బయటపడింది.

ఎప్పటి వంటకాలో..

రాత్రి మిగిలిపోయిన బిర్యానీ, చికెన్‌ను మరుసటి రోజు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఫుడ్‌ సేఫ్టీ నిబంధనల ప్రకారం వాటిని మరుసటి రోజు విక్రయించకూడదు. కేవలం పచ్చి మాంసం, నిర్ణీత టెంపరేచర్‌లో ఉంచుకోవాలి. కానీ హోటల్‌ నిర్వాహకులు సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరీ మరుసటి రోజు వినియోగదారులకు వండి విక్రయిస్తున్నారు.

ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కలుషిత ఆహారం తినడం వల్ల అనారోగ్యం పాలవక తప్పదు. బయట హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్ల వద్ద తీసుకునే ఆహారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మాంసాహారంలో రంగులు కలపడం వల్ల క్యాన్సర్‌ వచ్చే అవకాశం ఉంది. వంటల్లో వాడే ఫుడ్‌ కలర్‌, అజినోమోటో, నిల్వ ఉంచిన మాసం తినడం వల్ల అనేక రకాలైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్‌ చిట్ల కిరణ్‌, ఎండీ, అమృత ఎమర్జెన్సీ ఆసుపత్రి

నిల్వ పదార్థాలపై ఫిర్యాదు చేయండి



నిల్వ ఆహార పదార్థాలు ఎవరైన విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలి. వాటిని ల్యాబ్‌కు పంపి అది నిజమని రిపోర్టులో తేలితే సంబంధిత హోటల్‌ యజమానిపై చర్యలు తీసుకుంటాం. రంగుమారిన నూనె కూడా వ్యాపారులు ఉపయోగించకూడదు. అలా ఎవరైనా ఉపయోగిస్తే 99896 88699 నెంబర్‌కు ఫోన్‌ చేయవచ్చు.

– శ్రీనివాస్‌, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి

శాకంబరిగా పర్వత వర్ధినీదేవి



కరప శివాలయంలో శాకంబరిగా దర్శనమిచ్చిన పర్వతవర్ధినీదేవి

కరప: స్థానిక పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఏటా ఆషాఢమాసంలో వచ్చే సోమవారం రోజున అమ్మవారిని శాకంబరిగా అలంకరిస్తున్నట్టు దేవదాయశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది, అర్చకులతో కలిసి అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విలపర్తి శ్రీనివాస్‌ అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు చేసి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి, అమ్మవార్లను డీసీ విజయరాజు దర్శించుకున్నారు. కరప, పుట్టకొండ ఈఓలు తిరుమల రవితేజ, వడ్డాది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



జెండా ఊపి స్వచ్ఛత ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్‌



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు

- జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్‌
- కమిషనర్‌ తదితర అధికారులతో కలసి కలెక్టరేట్‌ వరకు అవగాహన ర్యాలీ

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్‌ పేర్కొన్నారు. స్వచ్ఛత వారోత్సవాలను పురస్కరించుకుని ఆయనతో పాటు మున్సిపల్‌ కమిషనర్‌ జె.వెంకటరావు, హౌసింగ్‌ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తదితర అధికారులు సోమవారం స్థానిక వివేకానంద పార్కు నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. సీబీఎం కూడలి, జిల్లా పరిషత్‌ జంక్షన్‌ మీదుగా కలెక్టరేట్‌ వరకు ఈ ర్యాలీ సాగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, రెడ్‌క్రాస్‌, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్‌, ఎన్‌సీసీ విద్యార్థులు, మెప్మా, ఏఎన్‌ఎం ఇతర సిబ్బంది హాజరై పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌ కార్యాలయం ఆవరణను శుభ్రం చేశారు. డీఆర్వో తిప్పేనాయక్‌ మాట్లాడుతూ మన పరిశరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడంపై అందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కమిషనర్‌ వెంకటరావు మాట్లాడుతూ పట్టణాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు రోడ్ల పక్కన ఉన్న చెత్తను తొలగించడం, తడి, పొడి చెత్తలను సేకరణ, తాగునీరు, ఆహార నియమాలు పాటించడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఏడీసీ సీహెచ్‌ నాగనరసింహారావు, సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ పి.సత్యకుమారి, ఎంపీహెచ్‌వో డి.పృథ్వీచరణ్‌, రెడ్‌క్రాస్‌ సంస్థ కార్యదర్శి కె.శివకుమార్‌, పీఆర్‌ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ బీవీ తిరుపాణ్యం, మెప్మా సిబ్బంది, పీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ, ఆదిత్య కళాశాల, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న 29వ డివిజన్‌ సచివాలయ సిబ్బంది

బోట్‌క్లబ్‌: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్‌ అన్నారు. స్థానిక 29వ డివిజన్‌లో సోమవారం స్వచ్ఛభారత్‌లో భాగంగా పలు రహదారులు శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మన పరిసరాల్లో చెత్తా, చెదారం చేరడంతో దోమలు విపరీతంగా పెరుగుతాయన్నారు. వీటి వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మేనేజర్‌ కె.సత్యనారాయణ, 29వ డివిజన్‌ సచివాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే నష్ట నివారణ



యండమూరులో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్‌

- వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్‌
- ముంపు పొలాల పరిశీలన

కరప: తగిన జాగ్రత్తలు తీసుకుంటే మునిగిపోయిన పంటల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎన్‌.విజయ్‌కుమార్‌ సూచించారు. మండలం యండమూరులో సోమవారం ఆయన కరప సబ్‌డివిజన్‌ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్‌, సిబ్బందితో కలిసి పర్యటించి ముంపు పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. విత్తనాలు చల్లి రెండు, మూడు రోజులైతే నీటిని పూర్తిగా తొలగించి, 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్‌ ఆఫ్‌ పొటాష్‌ చల్లుకోవాలన్నారు. ముంపునీరు పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో జరిగిన నష్టంపై అంచనాలను సర్వే చేసి, ప్రభుత్వానికి నివేదిస్తామని జేడీఏ తెలిపారు. సర్పంచ్‌ మార్నెళ్ల శ్రీనివాసరావు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్‌ ప్రత్యేక శిబిరాలు

- నగరంలో 12 ప్రాంతాల్లో ఏర్పాటు
- ఐదు రోజుల పాటు నిర్వహణ

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం నుంచి 27వ తేదీ వరకు 12 ప్రాంతాల్లో ఆధార్‌ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్‌ కమిషనర్‌ జె.వెంకటరావు పేర్కొన్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, అప్డేట్‌ చేసుకోవడానికి మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్‌ నెంబర్‌ అనుసంధానం చేయడంతో పాటు బయోమెట్రిక్‌ అప్‌డేట్‌ (ఫోటో–ఐరిష్‌–వేలిముద్ర), పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు, చిరునామాలో మార్పులు వంటి సేవలను అందిస్తారన్నారు. సిటీ పరిధిలో కృష్ణానగర్‌ 2ఏ, డైరీఫారం 11ఏ, గోలీలపేట 14ఏ, యానం రోడ్డు 15ఏ, చిన్న మార్కెట్‌ 21ఏ, యాళ్ల వారి వీధి 28బి, జగన్నాయక్‌పూర్‌ 30ఏ, బ్యాంకుపేట 32ఏ, సుభాష్‌ రోడ్‌ 35ఏ, గాంధీనగర్‌ 38ఎ, ఎల్‌బీ నగర్‌ 46బి, గైగోలుపాడు 50బి సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్‌ స్పష్టం చేశారు.

పరిశుభ్రతతో వ్యాధుల నివారణ



గురజనాపల్లిలో నిర్వహిస్తున్న స్వచ్ఛత ర్యాలీ

కరప: స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా సోమావరం గురజనాపల్లిలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కల్సి పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్‌ ఎ.శ్రీనివాసరావు, కార్యదర్శి భవానీ తదితరులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో సీజనల్‌ వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎం.వీరవేణి, హెచ్‌ఎం ఎ.సాయిమోహన్‌, స్టాఫ్‌ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టూడెంట్‌ కిట్ల పంపిణీ

గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ హైస్కూలులో సోమవారం స్టూడెంట్‌ కిట్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.2,419 విలువచేసే కిట్లను అందజేశారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ పి.వీరబాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ సత్వర పరిష్కారం



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్‌ వెంకటరావు

- కమిషనర్‌ వెంకటరావు
- డయల్‌ యువర్‌ కమిషనర్‌కు 11 ఫిర్యాదులు

కాకినాడ: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్‌ జె.వెంకటరావు హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్‌ యువర్‌ కమిషనర్‌ నిర్వహించారు. ప్రజలు ఫోన్‌ ద్వారా తెలియజేసిన పలు సమస్యలను కమిషనర్‌ స్వీకరించారు. ఇంజినీరింగ్‌, పబ్లిక్‌ హెల్త్‌, టౌన్‌ ప్లానింగ్‌ విభాగాలకు సంబంధించి 11 మంది తమ సమస్యలను వివరించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించారు. నేరుగా నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి కమిషనర్‌కు ఐదుగురు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్‌ గుంటూరు శేఖర్‌, స్మార్ట్‌ సిటీ ఎస్‌ఈ వెంకటరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్‌ పృథ్వీచరణ్‌, డీసీపీ హరిదాస్‌, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్‌ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ శిరిల్‌, ఈఈ మాధవి, పలువురు డీఈలు, ఏఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి



డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: అర్హులైన వారందరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం నగర నాయకులు డీఆర్వో తిప్పేనాయక్‌కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం రూ.4000కి పెన్షన్‌ పెంచి అందించడం అభినందనీయమని, అయితే ఇంకా అనేక మంది అర్హులు పెన్షన్‌ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. పెన్షన్‌ లబ్ధిదారులు మరణిస్తే వారి కుటుంబంలో అర్హులకు మరుసటి నెలలోనే పెన్షన్‌ మంజూరు అయ్యే అవకాశం ఉండాలన్నారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన పెన్షన్లకు జిల్లాలోనే పరిష్కారం అయ్యే ఏర్పాట్లు చేయాలన్నారు. పెన్షన్ల విషయమై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ పి.రమణితో డీఆర్వో చర్చించగా, ప్రభుత్వం లాగిన్‌ ఓపెన్‌ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.సత్తిరాజు, నగర కన్వీనర్‌ పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, అనపర్తి ఏడుకొండలు పాల్గొన్నారు.